సంఘాల వైపు.. పార్టీల చూపు

- యువజన, మహిళా, కుల సంఘాలపై పార్టీల దృష్టి
- అంతర్గత సమావేశాలు.. రహస్య మంతనాలు
- సామాజిక వర్గాల్లోని ద్వితీయ శ్రేణి నాయకులు, కేడర్‌ను తమ వైపు తిప్పుకునే ప్రయత్నాలు

జంగ్ తెలంగాణ 2023



సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో రాజకీయ సందడి మొదలైంది. శాసన సభ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ ఓట్ల వేట కోసం తమదైన శైలిలో ముందుకు కదులుతున్నాయి. యువజన, మహిళ, కుల సంఘాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయి. వారందర్నీ ఒకచోట సమీకరించి ప్రచారం నిర్వహిస్తున్నాయి. హామీలిస్తూ మద్దతు కూడగట్టే ప్రయత్నాలు చేపడుతున్నాయి. ఈ సంఘాలను మచ్చిక చేసుకుంటే లాభిస్తుందన్న ముందస్తు ఆలోచనతో నేతలు ఎత్తుకు పైఎత్తులు వేస్తూ తమ ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే జిల్లాలోని మేడ్చల్, కుత్బుల్లాపూర్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి, ఉప్పల్ నియోజకవర్గాల్లో పార్టీలన్నీ గెలుపు కోసం నువ్వా నేనా..? అన్నట్లు పోటాపోటీగా ప్రచారాన్ని ఉధృతం చేస్తున్నాయి. జిల్లాలో ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించటంతో.. ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్తున్నాయి. బీజేపీ మాత్రం జిల్లాలోని ఐదు అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించేందుకు అచితూచి అడుగులు వేస్తోంది. మొదటి విడతలో కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌ను, రెండో విడతలో ఉప్పల్ నుంచి మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ ఎస్ ప్రభాకర్‌ను ఖరారు చేయగా, ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని ముమ్మరం చేశారు. సీట్ల పొత్తులో భాగంగా కూకట్‌పల్లి స్థానాన్ని జనసేనకు కేటాయించిన బీజేపీ మల్కాజిగిరి, మేడ్చల్ స్థానంలో అభ్యర్థులను ఇంకా ప్రకటించలేదు. అయితే.. టికెట్ ఖచ్చితంగా వస్తుందని భావిస్తున్న నేతలు మాత్రం ఇంటింటి ప్రచారంతో ప్రజల మద్దతు కూడగట్టుకుంటున్నారు. రాజకీయ పరిస్థితులు ఎలా ఉన్నా.. జిల్లాలోని ప్రధాన పార్టీలన్నీ ఎత్తుకు పై ఎత్తులు వేస్తూ విభిన్న ప్రచార వ్యూహాలకు తెరలేపుతున్నారు. మేడ్చల్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లో మహిళా, యువజన సంఘాలతోపాటు కుల సంఘాలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి వారి మద్దతు కూడగటేట్ ప్రయత్నంపై పార్టీలు ముమ్మర ప్రయత్నం చేస్తున్నాయి. కుత్బుల్లాపూర్‌లో బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్, బీఆర్‌ఎస్ అభ్యర్థి వివేకానంద, మేడ్చల్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి మల్లారెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి తోటకూరి వజ్రేష్‌యాదవ్ మాత్రం యువజన, మహిళా, కుల సంఘాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. వారందరినీ సమీకరించి మద్దుతు కూడగట్టే పనిలో నిమగ్నమయ్యారు. మల్కాజిగిరి, ఉప్పల్, కూకట్‌పల్లి నియోజకవర్గాల్లోనూ పార్టీల అభ్యర్థులు అన్ని సంఘాలతో సమావేశాలు జరుపుతూ మద్దతు కూడగట్టుకుంటున్నారు.

అంతర్గత సమావేశాలు.. మంతనాలు

ఎన్నికల్లో భాగంగా రోజంతా ప్రచారం కొనసాగిస్తున్న పార్టీల అభ్యర్థులు.. రాత్రి సమయాల్లో ముఖ్య నేతలతో అంతర్గత సమావేశాలు నిర్వహిస్తూ.. మంతనాలు జరుపుతున్నారు. ముఖ్యంగా బస్తీలు, పట్టణాలతో పాటు మండల కేంద్రాలు, అపార్టుమెంట్లు, కాలనీలు, గ్రేటర్ కమ్యూనిటీ సొసైటీల్లో.. ఆరోజు జరిగిన రాజకీయ పరిణామాలు తెలుసుకుంటున్నారు. ఎదుటి పార్టీల ప్రచార పర్వం, అభ్యర్థుల శైలి, వారి కదలికలపై చర్చిస్తున్నారు. మరుసటి రోజు చేపట్టనున్న కార్యక్రమాలు చేపట్టాల్సిన వ్యూహాలకు పదను పెడుతున్నారు. వివిధ సామాజిక వర్గాల్లోని బలమైన వ్యక్తులు, ద్వితీయశ్రేణి నేతలను తమవైపు తిప్పుకొనేలా ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రధాన పార్టీల్లో కొంత మంది ద్వితీయశ్రేణి నాయకులు, అసంతృప్తులు అభ్యర్థులకు తలనొప్పిగా మారింది. వారిని తమతోపాటు ఉండేలా బుజ్జగింపులు చేస్తున్నారు. వారితో నేరుగా మంతనాలు జరుపుతూ.. అన్నీ చూసుకుంటామని భరోసా కల్పిస్తూ.. తమ వైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు.

మేడ్చల్ బీజేపీ అభ్యర్థి విక్రంరెడ్డి ప్రొఫైల్



పేరు: పట్లోళ్ల విక్రంరెడ్డి
తండ్రి: రాచిరెడ్డి
భార్య: శైలజ
సంతానం: ఇద్దరు కూతుళ్లు
వృత్తివ్యాపారం: విద్యాసంస్థలు
చదవు: ఎంఏ, ఎల్‌ఎల్‌బీ
నివాసం: గుండ్లపోచంపల్లి
రాజకీయ నేపథ్యం: ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్త. గతంలో బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు
ప్రస్తుతం: మేడ్చల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు, గుండ్లపోచంపల్లి ఉప సర్పంచ్‌గా పనిచేశారు. 1999లో ఏబీవీపీలో చేరి వివిధ హోదాల్లో పని చేశారు.

జోరుగా బీఆర్‌ఎస్ ప్రచారం

మేడ్చల్: నామినేషన్ల పర్వం ముగియడంతో మేడ్చల్‌లో బీఆర్‌ఎస్ జోరుగా సాగుతోంది. పట్టణం, మండలం, వివిధ గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ పథకాలను ఓటర్లకు వివరించి బీఆర్‌ఎస్‌కు ఓటు వేయాలని కోరారు. మంత్రి మల్లారెడ్డి వార్డులు, గ్రామాల్లో తన సొంతనిధులతో రోడ్లు వేయించారని, మరోసారి ఆయన్ను గెలిపిస్తే అన్ని ప్రాంతాలు అద్దంలా ఉంటాయని ఆయనకు ఓటు వేయాలని కోరారు. పట్టణంలోని అన్ని వార్డులు, అన్ని గ్రామాల్లో ఉదయం సాయంత్రం జోరుగా ప్రచారం సాగించారు.

మేడ్చల్‌లో కాంగ్రెస్ ర్యాలీ

మేడ్చల్: ఎన్నికల ప్రచారంలో భాగంగా మేడ్చల్ పట్టణంలో కౌన్సిలర్ చాపరాజు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మేడ్చల్ ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించి కాంగ్రెస్‌కు ఓటు వేసి అభ్యర్థి జంగయ్యయాదవ్‌ను గెలిపించాలని కోరారు. ర్యాలీలో నాయకులు పోచయ్య, రాజు, హేమంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం నాయకులు తమ అభ్యర్థి జంగయ్య నామినేషన్ సందర్భంగా కీసరకు బయలుదేరి వెళ్లారు.

ఎవరు వీడినా బీఆర్‌ఎస్‌కు నష్టం లేదు

శామీర్‌పేట్: పదవులు అనుభవించి పార్టీని వీడటం దుర్మార్గమని బీఆర్‌ఎస్ మూడుచింతలపల్లి మండల అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్ అన్నారు. మూడుచింతలపల్లి మండల కేంద్రంలో గురువారం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొందరు నేతలు పదవులను అనుభవించి, ఎన్నికల సమయంలో పార్టీని వీడినంత మాత్రాన బీఆర్‌ఎస్‌కు ఎలాంటి నష్టం జరగదన్నారు. సమావేశంలో జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు నందారెడ్డి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు జహంగీర్, ప్రధాన కార్యదర్శి అనిల్‌రెడ్డి, పలువురు కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన డీఎస్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్

జవహర్‌నగర్: దళిత సంఘర్షణ సమితి(డీఎస్‌ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రగుంట్ల వెంకటేశ్వర్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్ సమక్షంలో ఎర్రగుంట్ల వెంకటేశ్వర్ సుమారు వెయ్యి మంది తన అనుచరులతో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాబోయేది కాంగ్రెస్ పార్టీ అని, బీఆర్‌ఎస్ అరాచకాలకు ప్రజలు, నాయకులు విసుగు చెందారని, కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈసారి ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ గెలుపుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కారింగుల శంకర్‌గౌడ్, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్, నాయకులు సదానంద్, వేణు, రాజుయాదవ్, అనంతలక్ష్మి, మాజీ ఎంపీటీసీ మంజుల తదితరులు పాల్గొన్నారు.

వజ్రేశ్‌యాదవ్‌ను గెలిపించాలని ప్రచారం

ఘట్‌కేసర్: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోటకూర వజ్రేశ్‌యాదవ్‌కు ఓటేసి మేడ్చల్ ఎమ్మెల్యేగా గెలిపించాలని కాంగ్రెస్ నాయకులు అవుషాపూర్‌లో గురువారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ గతంలో చేసిన అభివృద్ధి పనులు, ప్రస్తుత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు హామీలను ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. కాంగ్రెస్ అధికారంలో వస్తే నిరుద్యోగులు, రైతులకు అండదండగా నిలుస్తుందని, చేయి గుర్తుకు ఓటేయాలని ఓటర్లను వేడుకున్నారు. కార్యక్రమంలో జంగయ్య ముదిరాజ్, మాధవరెడ్డి, బాబు, అమరేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, వామన్‌రెడ్డి, సల్మాన్, సురేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ గెలుపు కోసం చండీయాగం



చండీయాగం చేస్తున్న సీఎంఆర్ హెల్త్ సిటీ చైర్మన్ భద్రారెడ్డి

పోచారం: మేడ్చల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి చామకూర మల్లారెడ్డి గెలుపు కోసం అన్నోజిగూడలోని గాయత్రీదేవి ఆలయంలో సీఎంఆర్ హెల్త్ సిటీ చైర్మన్ చామకూర భద్రారెడ్డి గురువారం చండీయాగం నిర్వహించారు. అత్యధిక మెజార్టీతో మల్లారెడ్డి విజయం సాధించాలని అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు యాగం చేశారు. చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పోచారం మున్సిపల్ అధ్యక్షుడు మందడి సురేందర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ గొంగ్లె బాలేష్, ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శేఖర్, నాయకులు సామల బుచ్చిరెడ్డి, బద్దం జగన్‌మోహన్‌రెడ్డి, అబ్బవతిని నర్సింహ, పలువురు కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణపై దృష్టి సారించాలి

లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్ కళాశాలలో గురువారం ఉస్మానియా టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్ ఆధ్వర్యంలో క్రాస్ ఫ్యామిలీ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరాన్ని ప్రొఫెసర్ డి. శ్రీరాములు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్త్ మేనేజ్‌మెంట్, రక్తదానం ఆవశ్యకతను విద్యార్థులకు తెలిజేసేందుకు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగాఉచిత కన్సల్టేషన్‌తో పాటు గైనకాలజీ, పల్మనాలజీ, డెంటల్ తదితర వైద్య సేవలతో పాటు బ్లడ్ షుగర్, బీపీ తదితర పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నరేష్ రెడ్డి, అధ్యాపకులు వెంకటయ్య, గంగాధర్, చెన్నప్ప, సుమలత, విద్యాసాగర్, అప్పారావు, ప్యాట్రిక్, విద్యార్థులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇథనాల్ వ్యతిరేక ఉద్యమంపై ఉక్కుపాదం దారుణం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఇథనాల్ వ్యతిరేక ఉద్యమంపై ఉక్కుపాదాన్ని మోపడం సరైంది కాదని ఇది రాజ్యాంగం కల్పించిన హక్కులను ఉల్లంఘించడమేనని తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ... నారాయణపేట జిల్లా మరికల్ మండలం చిత్తనూర్ గ్రామం దగ్గర జూరాల ఆర్గానిక్ ఫార్మ్ అండ్ ఆగ్రో ఇండస్ట్రీస్ వారు ఇథనాల్ కంపెనీ ఏర్పాటు చేశారన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ జరగకుండా ఈ కంపెనీ ఏర్పాటు చేయడం సరైంది కాదని ఈ కంపెనీ ఉత్పత్తి జరిగితే దాని ప్రభావం చుట్టు పక్కల ఉన్న 54 గ్రామాలపై పడుతుందన్నారు. గాలి, నీరు, భూగర్భ జల కాలుష్యం పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కృష్ణానది కాలుష్యపు కోరల్లోకి వెళ్తుందని పర్యావరణవేత్తలు కూడా చెబుతున్నారని అయినా ప్రభుత్వం ఇవేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తు ఇథనాల్ కంపెనీకి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న వారిని చిత్రహింసలకు గురి చేసి జైలులో నిర్బంధించడం దుర్మార్గమైన చర్య అన్నారు. పోరాట కమిటీ నాయకులు, రైతులపై పెట్టిన కేసులను బేషరత్తుగా ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ... కంపెనీ పరిసర ప్రాంతాల్లోని పంట పొలాల్లో పని చేసే కూలీలు ఊపిరాడక స్పృహతప్పి పడిపోతున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రజలపై పెట్టిన కేసులను బేషరుత్తుగా ఎత్తివేసి ఆ కంపెనీని మూసి వేయాలని డిమాండ్ చేశారు. పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి తదితరులు ఉన్నారు.

విభిన్న పాలనల నిలయం మేడ్చల్

మేడ్చల్: రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మేడ్చల్ నియోజకవర్గంలో విభిన్న పాలన ఉంది. రాష్ట్రంలోనే ప్రత్యేక నియోజకవర్గం మేడ్చల్. ఒక జిల్లాలో ఉండే పాలనలు అన్ని మేడ్చల్‌లోనే ఉన్నాయి. పట్టణ గ్రామీణ వాతావరణంతో మేడ్చల్ ఉండటంతో నియోజకవర్గంలో ఏడు మున్సిపాలిటీలు, మూడు మున్సిపల్ కార్పొరేషన్లు, ఐదు మండల పరిషత్‌లు, ఐదు జెడ్పీటీసీలు, ఒక జిల్లా పరిషత్ ఇలా రాజ్యాంగంలో ఉన్న అన్ని పాలన వ్యవస్థలు మేడ్చల్ సొంతం. ఐదు మండలాలకు ఐదుగురు ఎంపీపీలు, ఐదుగురు జెడ్పీటీసీలు, 7 మున్సిపాలిటీలకు ఏడుగురు చైర్మన్లు, 3 కార్పొరేషన్లకు ముగ్గురు మేయర్లు, 61 గ్రామాలకు 61 మంది సర్పంచ్‌లు, 44మంది ఎంపీటీసీ సభ్యులు, 44మంది కో ఆప్షన్ సభ్యులు, 200 మంది కార్పొరేటర్లు, కౌన్సిలర్లు ఉన్నారు. సింగిల్ విండో చైర్మన్లు, డైరెక్టర్లు ఇలా చట్టంలోని అన్ని రకాల పదవులతో ప్రజాప్రతినిధులు ఉన్నారు. ఐదు మండలాలతో జిల్లా పరిషత్ ఉండటం ఐదుగురు జెడ్పీటీసీలు మేడ్చల్ వారే కావడంతో నియోజకవర్గమే జిల్లా పరిషత్‌గా ఉంది.

నామినేషన్ దాఖలు చేసిన వెంకటేశ్వర్లు యాదవ్

మేడ్చల్: మేడ్చల్ నియోజకవర్గ బీసీవై పార్టీ అభ్యర్థిగా ఓరుగంటి వెంకటేశ్వర్లు యాదవ్ తన నామినేషన్‌ను దాఖలు చేశారు. కీసర ఆర్డీవో కార్యాలయానికి ఆయన ర్యాలీగా వెళ్లి నామినేషన్ పత్రాలను అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడ్చల్‌లో భారత చైతన్య యువజన పార్టీ చెరుకు గుర్తుపై ప్రజలు ఓటు వేయడానికి సిద్ధంగా ఉన్నారని, పార్టీ విజయడంకా మోగిస్తుందని అన్నారు. మేడ్చల్ అభివృద్ధి బీసీవై పార్టీతో సాధ్యమన్నారు. బహుజనులు ఏకమైతే తన విజయం ఖాయమని అన్నారు.

11వ ప్రధాని నరేంద్రమోదీ రాక

అల్వాల్: ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగా అభ్యర్థన మేరకు దేశ ప్రధాని నరేంద్రమోదీ ఈ నెల 11వ తేదీ శనివారం నగరానికి రానున్నట్లు ఎస్సీ మోర్చా మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ అన్నారు. గురువారం అల్వాల్ ఆయన మాట్లాడుతూ 29 ఏళ్లుగా మంద క్రిష్ణ మాదిగా ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని పోరాటాలు చేస్తున్నారన్నారు. ఎస్సీ ఉమ్మడి రిజర్వేషన్ల వలన ఎస్సీ మాదిగా, మాదిగ ఉప కులాలు మాత్రమే ఎక్కువగా నష్టపోయారన్నారు. ఉద్యోగ సామాజిక రాజకీయ సామాజిక రంగంలో న్యాయం కోసం, జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ల ఫలాలను సమంగా పెంచాలని మంద క్రిష్ణ మాదిక అహర్నిశలు పోరాటాలు చేస్తున్నారన్నారు. 11న జరగబోయే సభకు అందరూ హాజరు కావాలని పిలుపు నిచ్చారు.

అన్ని వర్గాలను మోసం చేసిన మల్లారెడ్డి



కీసరలో నామినేషన్ సందర్భంగా ర్యాలీలో వజ్రేష్‌యాదవ్, సుధీర్‌రెడ్డి తదితరులు

- పేదల భూములు దోచుకున్న నిన్ను తరిమికొడతారు
- ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధం
- మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్
- నామినేషన్‌కు తరలివచ్చిన వేలాది మంది కార్యకర్తలు



నామినేషన్ దాఖలు చేస్తున్న వజ్రేష్‌యాదవ్

మేడ్చల్/కీసర: మేడ్చల్ నియోజకవర్గంలో పేదల భూములను దోచుకున్న మంత్రి మల్లారెడ్డిని నియోజకవర్గం నుంచి తరిమి తరిమి కొడతానని మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. గురువారం నామినేషన్ దాఖలు చేసిన సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, నక్కా ప్రభాకర్‌రెడ్డితో కలిసి కీసర చౌరస్తా నుంచి ఆర్డీవో కార్యాలయం వద్దకు కార్యకర్తలతో తరలివెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ మంత్రి మల్లారెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొంది మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి నియోజకవర్గంలోని ఏ మండలం చూసినా.. ఏ మున్సిపాలిటీ చూసిన తాను తన కుటుంబసభ్యులు, తన అనుచరులతో కలిసి భూకబ్జాలు చేసి కోట్లాది రూపాయల విలువచేసే పేదల భూములను కాజేస్తున్నారని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీల భూములను కబ్జా చేసిన మంత్రి మల్లారెడ్డికి ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. లోకంలో మనిషికి తినడానికి తిండి, బతకడానికి ఇంత భూమి ఉంటే చాలని, కానీ మంత్రి మల్లారెడ్డికి ఎందుకింత ఆశ అని, మూడుచింతలపల్లిలో, మైసమ్మగూడలో, సూరారంలో భూమిని కబ్జా చేసిన మంత్రికి ఎలా బుద్ధి చెప్పాలో ఇక్కడి ప్రజలకు బాగా తెలుసన్నారు. అన్నివర్గాల ప్రజలను మోసం చేసిన మంత్రి మల్లారెడ్డి ప్రతినిత్యం ప్రజల సమస్యలపై పోరాటం చేసే జర్నలిస్టులను సైతం మోసం చేశాడన్నారు. ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని తమ కాలేజీల్లో పనిచేస్తున్న ఉద్యోగులు సుమారు 10 వేల మందిని నియోజకవర్గంలో ఇంటింటికీ సర్వే పేరిట ఏజెంట్లుగా మార్చి ఓటర్ల ఫోన్ నంబర్లు తీసుకొని ఫోన్‌ఫే చేస్తామని చెబుతున్నారని, వారందరినీ కాంగ్రెస్ కార్యకర్తలు తరిమికొడతారు జాగ్రత్త అన్నారు. ఈనెల 30వ తేదీన బీఆర్‌ఎస్ పాలనతో పాటు మంత్రి మల్లారెడ్డి నుంచి విముక్తి లభిస్తుందన్నారు.

అవిశ్రాంత పోరాట యోధుడు చంద్ర పుల్లారెడ్డి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: గోదావరి లోయ రైతాంగ ప్రతిఘటన పోరాట నిర్మాణ యోధుడు చంద్ర పుల్లారెడ్డి 39వ వర్ధంతిని సీపీఐ(ఎంఎల్) రామచంద్రన్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్ర పుల్లారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రొఫెసర్ ఆరుట్ల జానికి రెడ్డి మాట్లాడుతూ... బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం చంద్రపుల్లారెడ్డి చేసిన పోరాటం చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. విప్లవోద్యమ నిర్మాణం కోసం అవిశ్రాంతంగా కృషి చేసిన గొప్ప వ్యక్తి అన్నారు. అమరవీరుల ఆశయాలను కొనసాగించినప్పుడే చంద్ర పుల్లారెడ్డికి ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. రైతు కూలీ సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ఎల్లుట్ల ఉపేందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏపీసీఎల్‌సీ అధ్యక్షుడు ముప్పాల సుబ్బారావు, సీపీఐఎంఎల్ రామచంద్రన్, రాష్ట్ర నాయకులు ఎల్లుట్ల మల్లేష్, పీవైఎల్ కన్వీనర్ భానుప్రసాద్, దుర్గం సైదులు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలోనే అభివృద్ధి సాధ్యం



జవహర్‌నగర్‌లో డిప్యూటీ మేయర్ శ్రీనివాస్ ప్రచారం



చౌదరిగూడ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి

జవహర్‌నగర్: బీఆర్‌ఎస్ పాలనలోనే అభివృద్ధి సాధ్యమైందని డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ అన్నారు. మేడ్చల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి మల్లారెడ్డిని గెలిపించాలని కోరుతూ డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం జవహర్‌నగర్‌లో ఇంటింటి ప్రచారం చేశారు. అదేవిధంగా ఉద్యమకారుల ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి మల్లారెడ్డిని గెలిపించాలని ప్రచారం

ఘట్‌కేసర్: మేడ్చల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి చామకూర మల్లారెడ్డిని గెలిపించాలని మున్సిపాలిటీలో చైర్ పర్సన్ పావనీ జంగయ్య, బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో గురువారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా 16వ వార్డులో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, మంత్రి మల్లారెడ్డి చేపట్టిన అభివృద్ధి పనులు ఓటర్లకు వివరించారు. కారు గుర్తుకు ఓటేసి మంత్రి మల్లారెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మైనార్టీ అధ్యక్షుడు కుతుబ్, మురళిగౌడ్, హబీబ్, మురళీగౌడ్, పవన్, విజయ్‌ముదిరాజ్, ఫయామ్, సందీప్‌చారి, పద్మ, లక్ష్మీ, జ్యోతి పాల్గొన్నారు. ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి మల్లారెడ్డి మేడ్చల్ గడ్డపై బీఆర్‌ఎస్ జెండాను ఎగురవేయాలని మంత్రి మల్లారెడ్డి గురువారం చౌదరిగూడ, కొర్రెముల్, కాచవానిసింగారంలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ రంగంలో కోడింగ్‌కు ఉజ్వల భవిష్యత్



అనురాగ్ యూనివర్సిటీ ఏఐ సమావేశంలో ముఖ్యఅతిథి మానసతో అధ్యాపకులు, విద్యార్థులు

ఘట్‌కేసర్: సాఫ్ట్‌వేర్ రంగంలో కోడింగ్‌కు ఉజ్వల్ భవిష్యత్ ఉందని గూగుల్ ప్రొడక్ట్ మేనేజర్ రిసోర్స్ పర్సన్ మానస ఇనంపూడి అన్నారు. అనురాగ్ యూనివర్సిటీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) విభాగం, ఐఈఈఈ సీఐఎస్ స్టూడెంట్ చాప్టర్ సహకారంతో ‹రోడ్ మ్యాప్ టూ సక్సెస్ కోడింగ్› అనే అంశంపై గురువారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై స్టూడెంట్ చాప్టర్ వెబ్ సైట్, లింక్డ్ ఇన్ హ్యాండిల్‌ను ప్రారంభించింది. ఆన్‌లైన్ కోర్సులు, సెల్ఫ్ ప్రాక్టీస్ ద్వారా కోడింగ్ నైపుణ్యాలను మెరుగు పరుచుకోవచ్చన్నారు. ఏఐ విద్యార్థులు హ్యాకథాన్లు, కోడింగ్ పోటీల్లో విరివిగా పాల్గొనాలన్నారు. ఐఈఈఈ సీఐఎస్ చైర్మన్ విజయేందరెడ్డి మాట్లాడుతూ ప్రోగ్రామింగ్ లాంగ్వేజెస్ నేర్చుకొని ప్రాక్టీస్ ద్వారా కోడింగ్‌లో నిపుణులుగా మారి కేరీర్‌లో విజయం సాధించాలన్నారు. కార్యక్రమంలో డీన్ విజయ్‌కుమార్, ఏఐ హెచ్‌ఓడీ మల్లికార్జున్‌రెడ్డి, సంతోశ్, ఏఐ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేద విద్య అభ్యసించిన వారికి గుర్తింపు



కీసరగుట్టలో నిర్వహించిన వేద పాఠశాల స్నాతకోత్సవం

కీసర: వేద విద్యను అభ్యసించిన విద్యార్థులకు సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) విద్యాశాఖాధికారి డా.ఎం.భాస్కర్‌రెడ్డి అన్నారు. గురువారం కీసరగుట్టలోని టీటీడీ వేదపాఠశాలలో నిర్వహించిన శ్రీవేద విజ్ఞాన పీఠం 25వ స్నాత, 42వ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జ్ఞానపీఠం ప్రధానాచార్యులు గూడా శ్రీనివాసశర్మ అవధాని వార్షిక నివేదిక సమర్పించారు. అనంతరం ముఖ్య అతిథిగా విచ్చేసిన భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ టీటీడీ ఆధ్వర్యంలో 33 విద్యా సంస్థలు నాణ్యమైన విద్య అందిస్తున్నాయని తెలిపారు. అనాథ పిల్లల కోసం బాలనందలో ఉచిత విద్య అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ధర్మగిరితో సహా మిగిలిన అన్ని వేద పాఠశాలలను ఒకే గొడుగు వేదిక్ యూనివర్సిటీ కిందకు తీసుకురావాలనే దృఢసంకల్పంతో తితిదే ఉందన్నారు. వేద విద్యార్థులందరికీ పరీక్ష విధానం ఒకే విధంగా ఉంటుందని తెలిపారు. అనంతరం ఉత్తీర్ణులైన విద్యార్థులకు యోగ్యతా పత్రాలు, ప్రోత్సాహకంగా తితిదే వారిచే అందజేసే రూ.లక్షతో పాటు పది గ్రాముల శ్రీవారి రజత పతకాలు అందజేశారు. వార్షికోత్సవ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

విద్యార్థినులు నాయకత్వాన్ని పెంపొందించుకోవాలి



మల్లాపూర్: విద్యార్థినులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని యుఎస్ కన్సల్ట్ పబ్లిక్ ఆఫైర్స్ ఆఫీసర్ అలెక్స్‌ండర్ ఎంసీ లారెన్ అన్నారు. గురువారం నాచారం సెయింట్ ఫాయిస్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ఇన్వెస్టిచర్ క్లబ్ వేడుకను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యూఎస్ కన్సల్ట్ పబ్లిక్ ఆఫైర్స్ ఆఫీసర్ అలెక్స్‌ండర్ ఎంసీ లారెన్ హాజరయ్యారు. అనంతరం విద్యార్థులకు బ్యాడ్జీలను అందజేసి ప్రమాణం చేయించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ఆయన మట్లాడారు. ప్రస్తుతం సమాజంలో తారతామ్యం లేకుండా విద్యార్థినులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. కరస్పాండెంట్ రెవ, ఆల్ఫోన్సా, ప్రిన్సిపాల్ వేలాంగిణి కుమారి, సెంథిల్ కుమార్, నూషిణ అలీ తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి చేయూత

గౌతంనగర్: ప్రతి ఒక్కరు సేవా కార్యక్రమాలు చేయాలని ప్రముఖ సంఘ సేవకులు సత్యనారాయణ, సాదు పరమేష్ అన్నారు. ఇందిరానెహ్రూ నగర్‌కు చెందిన పద్మమ్మ అతి చిన్న వయస్సులో కిడ్నీలు కోల్పోయి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటోంది. చిన్న పిల్లలు ఉన్న ఆమె దీన స్థితిలో ఉంది. విషయం తెలుసుకున్న జేఎల్‌ఎన్‌ఎస్‌కు చెందిన సత్యనారాయణ, సాదు పరమేష్‌లు ఆమె కుటుంబానికి 25 కిలోల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. రాజు, సాయికిరణ్, సాయికిరణ్, సిద్దిరాములు, షేక్, నాని తదితరులు పాల్గొన్నారు.